ఆగుతూ సాగుతూ అభివృద్ధి పనులు!

- త్వరితగతిన పూర్తి చేయాలంటున్న స్థానికులు
- విస్మరిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

తార్నాక మున్సిపల్ డివిజన్ పరిధిలో చేపట్టిన పలు అభివృద్ధి పనులు ఒక్క అడుగు ముందుకు.. రెండడుగులు వెనక్కి అన్న చందంగా మారాయి. సకాలంలో పనులు పూర్తి చేయించడంలో అధికారులు విఫలమవుతున్నారు. ఇదే అదనుగా భావించి కాంట్రాక్టర్లు ఇష్టానుసారంగా పనులు చేస్తున్నా స్థానిక ప్రజా ప్రతినిధులు వారికి తోచిందే తడవుగా హడావుడిగా వచ్చి పనులను పర్యవేక్షించడం పరిపాటిగా మారుతున్న ఈ తంతూ గత కొన్నేళ్ల నుంచి కొనసాగుతుంది.

–లాలాపేట


లాలాపేటలో నత్తనడకన మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్ నిర్మాణం

- శాంతినగర్ ఆర్యనగర్‌లో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణం పనులు అర్ధంతరంగా నిలిచిపోయి దాదాపుగా ఏడాది కావస్తోంది.
- లాలాపేట చంద్రబాబునగర్‌లో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణం పనులు నెల రోజులు దాటినా ఇంకా పూర్తి కాలేదు.
- లాలాపేటలో చేపట్టిన జాతీయ స్థాయి ప్రమాణాల స్విమ్మింగ్ పూల్ పనులు దాదాపు గా నాలుగేళ్లు అవుతున్నా ఇంకా పూర్తి కాలేదు.
- మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ పనులు చేపట్టి దాదాపుగా మూడేళ్లు అవుతోంది.
- లాలాపేట ప్రధాన రహదారి విస్తరణ గత 8 ఏళ్ల నుంచి కొనసాగుతూనే ఉంది.
- లాలాపేట సాయినగర్‌లో చేపట్టిన డబుల్ బెడ్రూమ్ నిర్మాణం దాదాపుగా 8 ఏళ్లు కావస్తోంది.
- తార్నాక, లాలాపేటలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు పూర్తవ్వడానికి ఇంకా ఎన్ని ఏళ్లు కావాలో అని ఆయా ప్రాంతాల వారు ప్రశ్నిస్తున్నారు.

డిప్యూటీ మేయర్ ఇంటి వద్ద సైతం నత్తనడకనే..


సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్

జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి నివాసముంటున్న తార్నాక హనుమాన్‌నగర్‌లో నూతనంగా సీసీ రోడ్డు నిర్మాణం కోసం గత సంవత్సరం డిసెంబర్ నెలలో రోడ్డు తవ్వారు. నాటి నుంచి నేటి వరకు అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో రోడ్డు నిర్మాణం చేయడానికి దాదాపు నెల రోజుల సమయం పట్టింది. ఈ నెల రోజుల కాలంలో డిప్యూటీ మేయర్ అధికారికంగా రెండు పర్యాయాలు ఆ పనులను పరిశీలించినా పనులు మాత్రం నత్తనడకన సాగుతున్నాయి. డిప్యూటీ మేయర్ ఇంటి వద్ద చేపట్టిన అభివృద్ధి పనులు రోడ్డు నిర్మాణానికి నెల రోజులు పడితే ఇక మిగతా ప్రాంతాల్లో చేపట్టిన అభివృద్ధి పనుల పరిస్థితి ఏంటని హనుమాన్‌నగర్ వాసులు వాపోతున్నారు. తాజాగా బుధవారం డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి సీసీ రోడ్డు నిర్మాణ పనులను మరోమారు పరిశీలించి పనుల్లో నాణ్యత పాటించాలని సూచించారు.

పకడ్బందీగా దరఖాస్తుల నమోదు ప్రక్రియ

జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్


ఎంట్రీ ప్రకియను పర్యవేక్షిస్తున్న కమిషనర్ రొనాల్డ్‌రాస్, జెడ్సీ రవికిరణ్

సికింద్రాబాద్: ప్రజాపాలన దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నిక్షిప్తం కోసం అవకతవకలకు తావులేకుండా చర్యలు తీసుకుంటున్నామని జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ పేర్కొన్నారు. జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ కార్యాలయంలో కొనసాగుతున్న ప్రజాపాలన దరఖాస్తుల డేటాఎంట్రీ ప్రక్రియను బుధవారం ఆయన పరిశీలించారు. ఒక్కో దరఖాస్తు నమోదుకు పడుతున్న సమయం, ఎదురవుతున్న సమస్యల గురించి కంప్యూటర్ ఆపరేటర్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అక్షరదోషాలు లేకుండా కుటుంబ సభ్యుల వివరాలు నమోదు చేయాలన్నారు. గ్రేటర్ పరిధి నుంచి మొత్తంగా 2474325 దరఖాస్తులు రాగా అభయ హస్తంకు సంబంధించినవి మాత్రమే 19 లక్షల దరఖాస్తులు అందాయన్నారు. వీటన్నింటిని కంప్యూటరీకరించడం కోసం జీహెచ్ఎంసీ తరఫున 300 మంది మాత్రమే డేటా ఎంట్రీ ఆపరేటర్లు ఉన్నారని ఎంట్రీలో జాప్యం జరుగకుండా ఉండేందుకు ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా కంప్యూటర్ ఆపరేటర్లను సమకూర్చి ప్రక్రియను వేగవంతం చేశామన్నారు. ప్రస్తుతం 635 డేటా ఎంట్రీ సెంటర్లను ఏర్పాటు చేసి 5 వేల మంది ఆపరేటర్ల ద్వారా వివరాలు కంప్యూటరీకరిస్తున్నామన్నారు. హయత్‌నగర్, కుత్బుల్లాపూర్ సర్కిళ్ల పరిధిలో నిర్లక్ష్యం వహించిన బాధ్యులపై చర్యలు తీసుకున్నామన్నారు. ఆయన వెంట ఉత్తర మండలం కమిషనర్ రవికిరణ్, సికింద్రాబాద్, బేగంపేట సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్లు సుధాంశ్, శంకర్ పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్ల అవకతవకలపై విచారణ జరిపించాలి

అడ్డగుట్ట: ఆజాద్ చంద్రశేఖర్‌నగర్‌లో డబుల్ బెడ్రూమ్‌లలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ వాటిపై విచారణ జరిపించాలని ఆ బస్తీవాసులు బుధవారం మారేడుపల్లి తహసీల్దార్ పద్మ సుందరిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బస్తీవాసులు మాట్లాడుతూ.. ఆజాద్ చంద్రశేఖర్ నగర్‌లో ఇది వరకు ఇచ్చిన 44 డబుల్ బెడ్రూమ్‌లలో జరిగిన అవకతవకలపై దృష్టి సారించాలని కోరారు. అదే విధంగా ఇంకా మిగిలి ఉన్న మరో 4 ఇళ్ల తాళాలు పగలగొట్టి కబ్జా చేసిన వారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అసలైన లబ్ధిదారులను గుర్తించి వారికే కేటాయించేలా చర్యలు చేపట్టాలని వినతిలో కోరారు. వినతి ఇచ్చిన వారిలో ఐలయ్య, భూపతి హరి, అర్జున్ రావు, యాదగిరి, పరశురాములు, నాగరాజ్ ఉన్నారు.

ఉత్సాహంగా వార్షికోత్సవం


విద్యార్థులను అభినందిస్తున్న మర్రి రాజశేఖర్ రెడ్డి

కంటోన్మెంట్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. బోయిన్‌పల్లిలోని సీఎంఆర్ హైస్కూల్‌లో ఎన్‌కాంటే–2024 పేరిట నిర్వహించిన వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణను అలవర్చుకుంటే భవిష్యత్‌లో ఎన్నో విజయాలు సాధిస్తారన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో నిర్వహించిన వివిధ క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, పరీక్షలలో రాణించిన వారికి బహుమతులు అందజేశారు. కరస్పాండెంట్ సీహెచ్ గోపాల్‌రెడ్డి, డైరెక్టర్ ఎస్‌కే రెడ్డి, బోర్డు మాజీ సభ్యుడు పాండుయాదవ్, ప్రిన్సిపాల్ నాగేశ్వర్ పాల్గొన్నారు.

కేలండర్ ఆవిష్కరణ


కేలండర్ ఆవిష్కరిస్తున్న పద్మారావు గౌడ్

లాలాపేట: మారేడుపల్లి మండల ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను ఎమ్మెల్యే పద్మారావుగౌడ్, అసోసియేషన్ ప్రెసిడెంట్ నర్సింహారెడ్డి, జనరల్ సెక్రటరీ శ్రీధర్, ట్రెజరర్ శాంత్‌రెడ్డి, అడ్వయిజర్లు కిషన్ ప్రసాద్, బ్రహ్మచారిలతో కలిసి ఆవిష్కరించారు.

అక్షింతల పంపిణీ


కార్తీకరెడ్డికి అక్షింతలు అందజేస్తున్న దృశ్యం

లాలాపేట: అయోధ్య రామ జన్మభూమి రాముడి అక్షింతల పంపిణీ కార్యక్రమం బుధవారం తార్నాకలో ప్రారంభమైంది. మాజీ మేయర్ బండా కార్తీకరెడ్డి నివాసంలో అక్షింతలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. శ్రీరాముని కరుణ కటాక్షం ప్రజలందరికి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో బండా చంద్రారెడ్డి, శ్రీనివాస్, బృంద, కుమారి ఆశ, శ్రీరాం, గోపాల్ చారి, సాయిబాబా, రాముపర్మ, మహేశ్, రాజేష్ పాల్గొన్నారు.

అనాథాశ్రమం నుంచి పారిపోయి వచ్చిన విద్యార్థినుల చేరదీత

రాంగోపాల్‌పేట్: తోటి విద్యార్థినులు అవమానకరంగా మాట్లాడారనే కారణంతో ఇద్దరు విద్యార్థినులు విజయనగరంలోని ఓ అనాథాశ్రమం నుంచి పారిపోయి రాగా చైల్డ్‌లైన్ అధికారులు చేరదీశారు. విజయనగరంలోని గంట స్తంభంలో ఓ ఎన్‌జీవో నిర్వహిస్తున్న హోంలో ఓ విద్యార్థిని (17) ఇంటర్ చదువుతుండగా మరో విద్యార్థిని (14) 9వ తరగతి చదువుతోంది. హోంలో తోటి విద్యార్థినులు కొంత మంది ఓ విద్యార్థిని పట్ల అవమానకరంగా మాట్లాడారు. దీంతో ఇద్దరు కలిసి ఈ నెల 9వ తేదీన విజయనగరంలో రైలు ఎక్కి గురువారం ఉదయం సికింద్రాబాద్‌లో దిగారు. ఇక్కడికి వచ్చాక ఏదో పని చేసుకోవాలని నిర్ణయించుకుని మోండా మార్కెట్‌లోని వస్త్రాల దుకాణాల్లోకి వెళ్లి పని చేస్తామని అడుగుతున్నారు. చిన్న వయసు ఉండటంతో వారిపై అనుమానం వచ్చిన కొంత మంది 100కు డయల్ చేయగా వారి సమాచారంతో చైల్డ్ లైన్ ప్రతినిధులు కనకయ్య, తాహేర్ తదితరులు అక్కడికి చేరుకుని కాచిగూడ నింబోలిఅడ్డలోని బాలికల హోమ్‌కు తరలించారు.

మహిళా సాధికారతతోనే సమాజాభివృద్ధి


కుట్టు మిషన్లు అందజేస్తున్న సురేష్‌చౌదరి

సనత్‌నగర్: మహిళా సాధికారతతోనే సమాజ అభివృద్ధి సాధ్యమని, అందుకోసమే వారు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు వీలుగా కుట్టు మిషన్ల పంపిణీ చేసినట్లు జెక్‌కాలనీ ఎస్‌వీఎస్‌ఎస్ అపార్ట్‌మెంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు సురేష్‌చౌదరి అన్నారు. కుట్టు శిక్షణ పొందిన మహిళలకు సనత్‌నగర్‌లోని చేతన ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఉచితంగా కుట్టు మిషన్లు అందజేశారు. ఎస్‌వీఎస్‌ఎస్ అపార్ట్‌మెంట్స్ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో మహిళలకు కుట్టుమిషన్లతో పాటు లయన్స్ క్లబ్ సహకారంతో కాలనీలోని అపార్ట్‌మెంట్ల వాచ్‌మెన్లకు దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సురేష్‌చౌదరి మాట్లాడుతూ.. మహిళలు స్వయం ఉపాధిని ఏర్పరచుకోవడం ద్వారా వారు స్వతహాగా సముపార్జన చేసి తమ కాళ్లపై తాము నిలబడగలుగుతారన్నారు. మహిళలకు ఉపాధి కల్పించే క్రమంలో చేతన ఫౌండేషన్ లాంటి సంస్థలు మరిన్ని ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు సంపత్‌కుమార్, తిరుపతిరెడ్డి, మంగమూరి, మాధవి, శేషగిరిరావు, ఎలీషా, రమణి, రషీద్, మాధవ్, గణేష్ పాల్గొన్నారు.

వారిపై పెట్టిన కేసులను ఉప సంహరించుకోవాలి


మాట్లాడుతున్న శ్రీకాంత్

రాంగోపాల్‌పేట్: గత నెల 29న అక్షింతల శోభా యాత్ర నిర్వాహకులపై మార్కెట్ పోలీసులు పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలని బీజేపీ సీనియర్ నాయకులు చీర శ్రీకాంత్ డిమాండ్ చేశారు. ఈ కేసులో ఉన్న వారికి మార్కెట్ పోలీసులు 41సీ–ఆర్పీ కింద ఇచ్చిన నోటీసులకు గురువారం లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. అనంతరం మోండా కార్పొరేటర్ కొంతం దీపిక, నాయకులు బృహస్పతి తదితరులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. రెజిమెంటల్ బజార్ సంతోషీమాత దేవాలయం నుంచి ఎస్పీరోడ్ హనుమాన్ దేవాలయం వరకు తాము ర్యాలీ నిర్వహిస్తే దానిపై మార్కెట్ పోలీసులు కేసు నమోదు చేయడం బాధాకరమన్నారు. డీజే పెట్టినా పోలీసుల సూచనల మేరకు తక్కువ సౌండ్‌తో నడిపించామని, భక్తులు హారతులు, పువ్వులు, టపాసులు పేలుస్తూ స్వాగతం పలికారని ఇవి తప్పన్నట్లు పోలీసులు కేసు నమోదు చేశారని అన్నారు. కేసులు ఉప సంహరించుకోకుంటే ఈ నెల 13వ తేదీన ధర్నాచౌక్‌లో ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరేష్, ప్రతాప్, మదన్, బాబు, సునిల్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలపై అవగాహన


కార్యక్రమంలో బీజేపీ నేతలు

సనత్‌నగర్: వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో భాగంగా బీజేపీ ఆధ్వర్యంలో సనత్‌నగర్ ఉదయ్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో బుధవారం పలు పథకాలపై అవగాహన కల్పించడంతో పాటు దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించారు. పీఎం జన్‌ధన్ యోజన, పీఎం సురక్ష బీమా యోజన, పీఎం జీవన్ జ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, ఆయుష్మాన్ భారత్, ఆధార్ ఎన్‌రోల్‌మెంట్, ఆధార్ మార్పుల చేర్పులు, పీఎం ఉజ్వల యోజన పథకం కింద గ్యాస్ కనెక్షన్ దరఖాస్తుల స్వీకరణ, పీఎం ముద్ర యోజన వంటి పథకాలపై విస్తృత అవగాహన కల్పించారు. అదేవిధంగా అప్పటికప్పుడు దరఖాస్తులు అందజేసి పూర్తి చేసిన వాటిని స్వీకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన ప్రత్యేక ఆధార్ కేంద్రంలో మార్పులు చేర్పులు చేసుకునేందుకు ప్రజలు బారులుతీరారు. బీజేపీ సనత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు కస్నూరి క్రాంతికుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో దయానంద్, శ్రీశైలంగౌడ్, ఉమా, లక్ష్మీనారాయణ, ఆకుల మహేష్, చంద్రకుమార్, సత్యనారాయణ, వై.శ్రీను, ఆకూరి శ్రీనివాసరావు, సునీల్, సంతోష్ పాల్గొన్నారు.

కస్టమర్లా వచ్చింది.. బంగారం కొట్టేసింది


ఆభరణాలు కొట్టేసిన మహిళ

రాంగోపాల్‌పేట్: బంగారు ఆభరణాలు కొనేందుకు వచ్చినట్లు నటించిన ఓ మహిళ 11 గ్రాముల ఆభరణాలతో ఉడాయించిన ఘటన మార్కెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. పాట్ మార్కెట్‌లో సంజయ్ ఉపాధ్యాయ అనే వ్యక్తి బంగారు నగల షాపు నిర్వహిస్తున్నాడు. ఈ నెల 7వ సాయంత్రం ఓ మహిళ వచ్చి చెవి కమ్మలు చూపించమని షాపులో పనిచేసే వ్యక్తిని కోరింది. కొన్ని ఆభరణాలు చూపించగా అవి నచ్చలేదని మరి కొన్ని తేవాలని చెప్పింది. వేరే ఆభరణాలు తెచ్చేలోపు అందులో ఉన్న రూ.70 వేల విలువ చేసే 11 గ్రాముల చెవి కమ్మలను దాచేసుకుని ఏవీ కూడా నచ్చలేదని చెప్పి వెళ్లిపోయింది. కాసేపటికి సిబ్బంది బంగారు ఆభరణాలు పోయిన సంగతి తెలుసుకుని సీసీ ఫుటేజీ పరిశీలిస్తే ఆ గుర్తు తెలియని మహిళ కొట్టేసినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

'రాజ్యాంగ విలువలకు కేంద్ర తిలోదకాలు'

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ విలువలను తుంగలో తొక్కుతున్నదని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్‌బాబు విమర్శించారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఆధ్వర్యంలో లూయిస్ బ్రెయిలీ జయంతి వారోత్సవాల ముగింపు కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న స్కైలాబ్‌బాబు మాట్లాడుతూ... బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మతోన్మాద బీజేపీని ఓడించేందుకు ప్రజలందరు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. దేశంలో మతాలన్ని సమైక్యత స్ఫూర్తితో పని చేయాలని కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: ఎయిర్‌పోర్ట్, సంజీవయ్యపార్కు సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ కిషోర్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు.

- ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు బేగంపేట ఫేస్ హాస్పిటల్, గురుమూర్తి లేన్, మోతీలాల్‌నెహ్రూ నగర్, ఎయిర్ కార్గో, భగత్‌సింగ్‌నగర్, శ్యాంలాల్ బిల్డింగ్స్. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఫ్లైయాష్, ఎన్‌బీటీనగర్, వికార్‌నగర్, ప్రకాష్‌నగర్ ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందన్నారు.

కంటోన్మెంట్ బోర్డు పరిధిలో..

కంటోన్మెంట్: విద్యుత్ ఫీడర్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల నరికివేత కారణంగా కంటోన్మెంట్ బోర్డు పరిధిలో విద్యుత్ కోతలు ఉంటాయని ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. జింకానా, తిరుమలగిరి ఫీడర్ల పరిధిలో ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, తిరిగి మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

నేడు అమీర్‌పేటలో ఎమ్మెల్యే పర్యటన

సనత్‌నగర్: అమీర్‌పేట డివిజన్‌లో సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ గురువారం పర్యటించనున్నారు. ఉదయం 11 గంటలకు డి విజన్ పరిధిలోని కుమ్మరిబస్తీ, హనుమాన్ దేవా లయ ప్రాంతాల్లో పర్యటించి అభివృద్ధి పనుల ను పర్యవేక్షణతో పాటు ప్రజా సమస్యలను అడిగి తెలుసుకోనున్నట్లు బీఆర్ఎస్ శ్రేణులు తెలిపారు.

హుండీ ఆదాయం లెక్కింపు

అమీర్‌పేట: అమీర్‌పేట శ్రీ హనుమాన్ దేవాలయం హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కించగా 93 రోజులు హుండీల ద్వారా రూ.6,53,905 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణ అధికారి విఠలయ్య తెలిపారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.19, నల్లవంకాయ 28, పొడుగు వంకాయ 28, బెండకాయ 45, పచ్చిమిర్చి 45, బజ్జీమిర్చి 50, క్యాప్సికమ్ 60, పచ్చకాకర 52, పందిరి బీర 45, క్యాబేజీ 19, క్యారెట్ 31, దొండ 28, గుండబీన్స్ 40, గింజ చిక్కుడు 45, గోకరకాయ 50, కీర 17, దోసకాయ 28, బీట్‌రూట్ 17, ఉల్లిగడ్డ 23, ఆలుగడ్డ 19, చామగడ్డ 55, మొరంగడ్డ 23, కందగడ్డ 50, సొరకాయ 11, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 4–6, ముల్లంగి 4–6.

ప్రొ.ఉమేష్‌కుమార్‌కు సన్మానం



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ సైన్స్ కాలేజీ కెమిస్ట్రీ విభాగం మాజీ హెడ్ ప్రొ.ఉమేష్ కుమార్‌ను బీఆర్ఎస్ పార్టీ నాయకురాలు, పూర్వ విద్యార్థి డాక్టర్ సత్యవతి ఘనంగా సన్మానించారు. బుధవారం కెమిస్ట్రీ విభాగంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉద్యోగ విరమణ చేసిన ప్రొ.ఉమేష్‌కుమార్‌కు శాలువాతో సన్మానించారు. ఉస్మానియా యూత్ వెల్ఫేర్ ఆఫీసర్‌గా 2012లో జరిగిన జాతీయ సాంస్కృతిక పోటీలను సమర్థవంతంగా నిర్వహించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రశంసలు అందుకున్నట్లు తెలిపారు. ప్రొ.మురళీధర్‌రెడ్డి, హెచ్‌డీఎఫ్‌సీ మేనేజర్ జైపాల్ రెడ్డి, రాధా, రాజశేఖర్ పాల్గొన్నారు.

నేడు బర్కత్‌పురా పీఎఫ్ కార్యాలయం వద్ద ధర్నా

సనత్‌నగర్: తెలంగాణ నేషనల్ యజిటేషన్ కమిటీ (ఎన్ఏసీ) ఆధ్వర్యంలో బర్కత్‌పురాలోని పీఎఫ్ కార్యాలయం ఎదుట పెన్షనర్ల ధర్నా నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ బ్యాంక్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ మాజీ సెక్రటరీ పూర్మానీ మల్లారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆల్ ఇండియా ఎన్ఏసీ అధ్యక్షుడు కమాండర్ అశోక్ రావత్ ఆదేశాల మేరకు దేశవ్యాప్తంగా ఉన్న అన్ని ఆర్‌పీఎఫ్‌సీ కార్యాలయం వద్ద ఈ ధర్నాకు పూనుకోవడం జరిగిందన్నారు. అందులో భాగంగా హైదరాబాద్ ఆర్‌పీఎఫ్‌సీ ముందు చేపట్టే ధర్నాకు పెద్ద సంఖ్యలో ఈపీఎస్–95 పెన్షనర్లు హాజరై విజయవంతం చేయాలని కోరారు. త్వరలో పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు జరుగుతున్న దృష్ట్యా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి పెన్షనర్ల సమస్యలను పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ధర్నా అనంతరం ఆర్‌పీఎఫ్‌సీకి వినతిపత్రం అందజేస్తామన్నారు. ధర్నాలో ఎన్ఏసీ అధ్యక్షులు శ్రీలక్ష్మీ కరవది, ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి సామల తదితరులు హాజరవుతారన్నారు.

నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న మర్రి రాఘవయ్య

అడ్డగుట్ట: నూతన పెన్షన్ విధానం తక్షణమే రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ ప్రధాన కార్యదర్శి మర్రి రాఘవయ్య డిమాండ్ చేశారు. గత మూడు రోజులుగా దేశవ్యాప్తంగా రైల్వే కార్యాలయాలు, వర్క్‌షాప్‌ల వద్ద నిరాహార దీక్షలు చేపట్టారు. అందులో భాగంగా బుధవారం ఎంప్లాయీస్ సంఘ్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లోని రైల్ నిలయం ఎదురుగా చేపట్టిన నిరాహార దీక్షలో రాఘవయ్య పాల్గొని మాట్లాడారు. పెన్షన్ రాజ్యాంగం కల్పించిన హక్కని శాంతియుతంగా నిరాహార దీక్షల ద్వారా నిరసన తెలుపుతున్నామని స్పందించకుంటే తీవ్ర పరిణామాలు తప్పవన్నారు. భారతీయ రైల్వేలో 80 వేల కిలో మీటర్ల లైన్లలో 7 వేల రైల్వే స్టేషన్లలో 13 లక్షల కార్మికులు, ఉద్యోగులు ప్రతికూల పరిస్థితులలో విధులు నిర్వహిస్తున్నారని విధి నిర్వహణలో ప్రతీ రోజు ఇద్దరు కార్మికులు మృతి చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభాకర్ ఆంధ్రూ, భరణి భాను, షేక్ రవూఫ్, రుద్రారెడ్డి, భుజంగరావు, కేవీఆర్. ప్రసాద్, అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆర్పీఎఫ్ పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి


సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు

చిలకలగూడ: రైల్వే రక్షకదళ విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తామని అసోషియేషన్ ప్రతినిధులు తెలిపారు. చిలకలగూడలోని రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోషియేషన్ కార్యాలయంలో బుధవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో పలు అంశాలపై చర్చించి తీర్మానాలు చేశారు. సమస్యల పరిష్కారానికి ఏకతాటిపై కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇటీవల సంబంధిత ఉన్నతాధికారులను కలిసి సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ప్రెసిడెంట్ వరప్రసాద్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ జీవీఎస్ రాయుడు, ఆర్గనైజింగ్ కార్యదర్శి వీ.ముత్యాలు పాల్గొన్నారు.

సీనియర్లను గుర్తించండి


మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసిన వెంకట్‌రాజ్

అమీర్‌పేట: కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేసిన సీనియర్లను గుర్తించి నామినేటెడ్ పదవులు ఇవ్వాలని సీనియర్ నాయకుడు, మాజీ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి డి.డి.వెంకట్‌రాజ్ విజ్ఞప్తి చేశారు.బుధవారం కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసి తన బయోడేటాను అందజేశారు.ఈ సందర్భంగా వెంకట్‌రాజ్ మాట్లాడుతూ.. క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ పదవిని ఆశిస్తున్నట్లు తెలిపారు.నామినేటెడ్ పదవులు ఎవరికిచ్చినా సీనియర్లను పరిగణలోకి తీసుకోవాల్సిన అవసరముందన్నారు.

జూనియర్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ల సంఘం అధ్యక్షుడిగా లక్ష్మయ్య



లాలాపేట: తెలంగాణ రాష్ట్ర జూనియర్ కళాశాలల ఫిజికల్ డైరెక్టర్ల సంఘం అధ్యక్షుడిగా లక్ష్మయ్య ఎన్నికయ్యారు. ఇటీవల ఎల్‌బీ స్టేడియంలోని ఒలింపిక్ భవన్‌లో జరిగిన సంఘం కార్యవర్గ సమావేశంలో లక్ష్మయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న ఫిజికల్ డైరెక్టర్ల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు ప్రిన్సిపాల్‌గా ఫిజికల్ డైరెక్టర్లకు అవకాశం ఇవ్వాలన్నారు. క్రీడారంగానికి మంచి భవిష్యత్‌ను కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.

షేక్ ఫాతిమా జీవిత చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలి



ఉస్మానియా యూనివర్సిటీ: మహిళల విద్యకు విశేష కృషి చేసిన షేక్ ఫాతిమా, సావిత్రీబాయి పూలేకు సమకాలికురాలని ఓయూ ప్రొ.అక్తర్ అలీ అన్నారు. ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఓయూ రీసెర్చ్ స్కాలర్ రహీం అధ్యక్షత జరిగిన షేక్ ఫాతిమా జయంతి కార్యక్రమానికి ప్రొ.అక్తర్ అలీ పాల్గొని ఫాతిమా చిత్రపటానికి నివాళి అర్పించి మాట్లాడారు. సావిత్రి బాయి తరహా షేక్ ఫాతిమా కూడా మహిళల విద్యా, వారి హక్కుల కోసం పోరాడిందని కానీ ఆమె చరిత్ర ప్రజలకు తెలియకుండా మరుగున పడిపోవడం విచారకరమన్నారు. ఫాతిమా జీవిత చరిత్రను హై స్కూల్ స్థాయిలో పాఠ్యాంశంగా చేర్చాలని డిమాండ్ చేశారు. విద్యార్థి నేతలు ఆంజనేయులుగౌడ్, సుధాకర్, రెడ్డి శ్రీను, ఉదయ్, రాజుయాదవ్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

జాతీయ యువజనోత్సవాలకు డా.చిన్నబాబు నేతృత్వం



ఉస్మానియా యూనివర్సిటీ: స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని ఈ నెల 27న మహారాష్ట్రలోని నాసిక్‌లో జరిగే జాతీయ యువజనోత్సవాలకు హాజరయ్యే బృందానికి డాక్టర్.జె చిన్నబాబు నేతృత్వం వహించనున్నారు. ఓయూ పరిధి విద్యానగర్‌లోని వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో అధ్యాపకులుగా పని చేస్తున్న ఆయన ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ పదవిలో కొనసాగుతున్నారు. ఉత్సవాల్లో జరిగే వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో 30 మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొననున్నట్లు తెలిపారు.

బాలికపై లైంగిక దాడికి యత్నించిన వ్యక్తి రిమాండ్

సనత్‌నగర్: బాలికపై లైంగిక దాడికి యత్నించిన వ్యక్తిని బేగంపేట పోలీసులు రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం..బేగంపేట ప్రకాష్‌నగర్ ప్రాంతానికి చెందిన బాలిక (9) ఈ నెల 7వ తేదీన సాయంత్రం ఇంటి ముందు ఆడుకుంటుండగా ఓ వ్యక్తి అటుగా వచ్చి పాపను గమనిస్తూ అక్కడే మాటేసి ఒంటరిగా ఉన్న సమయంలో లైంగిక దాడికి ప్రయత్నించాడు. భయంతో పరుగెత్తిన బాలిక కుటుంబ సభ్యులకు విషయం చెప్పింది. అప్పటికే ఆ వ్యక్తి అక్కడి నుంచి పరారయ్యాడు. సీసీ కెమెరాలను పరిశీలించగా బిహార్ రాష్ట్రానికి చెందిన జితేందర్ (28) బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినట్లు గుర్తించారు. నిందితుడు స్థానికంగా వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. నిందితుడిని పట్టుకున్న కుటుంబ సభ్యులు పోలీసులకు అప్పగించగా జితేందర్‌పై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.